బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు బకాయి ఉన్న 13 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, భారతి మాట్లాడుతూ ఉద్యోగులు రోడ్డెక్కి పోరాటం చేస్తేనే తప్ప వేతనాలు ఇవ్వరా అని ప్రశ్నించారు. గతంలో కూడా పోరాటం చేస్తే వేతనాలు ఇచ్చారని ప్రస్తుతం ఇప్పుడు కూడా 13 నెలలు బకాయి వేతనాలు ఉన్నాయని, ఇన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు మాత్రం లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటూ నెలనెలా అనుభవిస్తున్నారని, జీతాలు మీదే ఆధారపడి ఉన్న తమకు ఇచ్చేదే అతి తక్కువ వేతనాలు అవి కూడా నెలనెలా ఇవ్వకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇచ్చేంతవరకు, తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెబాట పడతామని రెండు నెలల ముందే రాతపూర్వకంగా సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందని అయినా స్పందించలేదని, అనివార్య పరిస్థితిలో తమ జీవితాలు కోసం సోమవారం నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ అన్ని అభివృద్ధి చేయాలని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ అందులో పనిచేస్తున్న సిబ్బందికి నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా బకాయి వేతనాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు , సిఐటియు నాయకులు

కలెక్టర్‌కి వినతి.. ధర్నా అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని సంఘం నాయకులు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ అగ్రికల్చర్ ఏడీని పిలిచి వెంటనే జీతాలు విడుదల కోసం రెండోసారి ఫైల్ పెట్టాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలు పరిష్కారం కోసం 15 రోజుల తర్వాత నిర్దిష్టంగా చర్చించి పరిష్కారం చేస్తారని హామీ ఇచ్చారు.

నేటి నుంచి సమ్మె.. సంస్థలో పనిచేస్తున్న అధికారులు ప్రతి సందర్భంలోనూ జీతాలు ఇవ్వడంలో మీన వేషాలు లెక్క వేస్తున్నారని ప్రస్తుతం జీతాలు ఇచ్చేంతవరకు సమ్మె కొనసాగిస్తామని నేటి నుంచి సమ్మెలోకి వెళ్తామని డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్‌కి రెండోసారి సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ ఉద్యోగులు నాయకులు హనుమంతు, రాజేశ్వరి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరం జరగాలి : కలెక్టర్

- పిజిఆర్ఎస్‌కు 332 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షుణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అలాగే జిల్లా జాయింటు కలెక్టరు జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్‌తో పాటు డిఆర్ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా వేగంగా పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్మెంట్లను ఇవ్వాలని, సంబంధిత ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాలలో పర్యటించి ఎండార్స్మెంట్లను పరిశీలించాలని ఆదేశించారు. రీ ఓపెన్‌కి అవకాశం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ఆయా కార్యాలయాలకు పిజిఆర్ఎస్ కింద అర్జీలు సమర్పించేందుకు వచ్చే ప్రజలను ఆప్యాయతతో పలకరించి సమస్యలను అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించాలని అన్నారు. ప్రతి వారం నిర్వహించే సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లాలోని హెచ్ఓడీలందరూ ఉదయం 9.30 గంటలకు రావాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మొత్తం 332 అర్జీలు అందగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 265, పోలీస్ శాఖ 11, జిల్లా పంచాయతీ శాఖ 3, విద్యాశాఖ 3, ఐసిడిఎస్ 1, దేవాదాయ శాఖ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 1, డిఆర్‌డిఏ 25, విద్యుత్ 1, పౌర సరఫరాల శాఖ 8, మునిసిపల్ కమిషనర్ చిత్తూరు 1, పశుసంవర్ధక శాఖ 1, మెప్మా 1, వ్యవసాయ శాఖ 3, గృహ నిర్మాణశాఖ 1, ఆర్‌డబ్ల్యూఎస్ 2, ఎంపిడిఓ బైరెడ్డిపల్లి 1, ఎంపిడిఓ గంగాధర నెల్లూరు 1, ఎంపిడిఓ పెనుమూరు 1, ఎంపిడిఓ వి.కోట 1 అర్జీలు అందాయి.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పరిష్కారంలో అలసత్వం చేయకండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి విఎన్.మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్‌పిని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్‌రాజు, డిటిసి డీఎస్పీ రాంబాబుని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. మొత్తం 54 ఫిర్యాదులు అందగా సైబర్ క్రైమ్ 1, వేధింపులు 5, కుటుంబ తగాదాలు 6, వేధింపులు 3, ఇంటి తగాదాలు 7, భర్త వేధింపులు 1, భూ తగాదాలు 14, డబ్బు తగాదాలు 12, దారి సమస్యలు 1, ఆస్తి తగాదాలు 4 ఉన్నాయి.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. నగరపాలక పరిధిలో పలువురు ప్రజలు తమ సమస్యలపై వినతులను కమిషనరుకు సమర్పించి పరిష్కరించాలని కోరారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. గతవారం అందిన వినతులపై సమీక్షించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 3, ఫించన్లు 3, రెవెన్యూ 1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

వికటించిన ఆర్ఎంపి వైద్యం

- కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆర్ఎంపి వైద్యం వికటించి మాట పడిపోయిందని పలమనేరు మండలం కొలమాసనపల్లికి చెందిన కల్పన (కరిష్మా) సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయింది. నకిలీ ఆర్ఎంపి వైద్యుడిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా బాధితురాలి బంధువులు మాట్లాడుతూ పలమనేరు కొలమాసనపల్లికి చెందిన కల్పన ముస్లీమ్‌ను వివాహం చేసుకుంది. కొంతకాలం తరువాత భర్త చనిపోవడంతో ఆమె అమ్మగారి ఇల్లు వీకొటకు వచ్చి చేరింది. ఇటీవల అనారోగ్యం రావడంతో పలమనేరుకు చెందిన షేక్ అంజాద్‌బాషా వద్ద చికిత్స చేయించుకుంది. వైద్యం వికటించి ఆమెకు మాట పోయింది. ఈవిషయాన్ని ఆర్ఎంపి వైద్యుడి దృష్టికి తీసుకుపోతే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా బాధితులపట్ల దురుసుగా ప్రవర్తించాడని వాపోయారు. తన కుమార్తె మూగబోవడానికి కారణమైన ఆర్ఎంపి డాక్టర్ అంజాద్ బాషాపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

నకిలీ ఆర్ఎంపి వైద్యుడిపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

మమ్మల్ని అడ్డుకునేదెవరు..?

- కాలువ పైపులు మూసేస్తే రసాయన నీరు రోడ్డుపై వదులుతాం...

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 21 వ వార్డు కొత్తపేటలో మురుగు కాలువల్లో ఎడతెరపి లేకుండా ప్రవహించే రసాయన నీటిని అదుపు చేయడానికి మున్సిపల్ అధికారులు డైయింగ్ యూనిట్లకు అనుసంధానంగా ఉన్న మురుగునీటి కాలువపైపులను మూసేశారు. డైయింగ్ నుంచి వచ్చే వృధా రసాయన నీటిని శుద్ధీకరించి మళ్లీ మీరే వినియోగించుకోవాలని సూచించారు. అయితే అధికారుల సూచనలు డైయింగ్ యూనిట్‌దారుల చెవికెక్కడం లేదు. మీరు చెప్పేదేంటి.. మేము వినేదేంటి అనే చందాన వ్యవహరిస్తున్నారు. కాలువలు లేకుంటే రోడ్లు ఉంది కదా అంటూ రోడ్డుపై రసాయన నీరు వదిలేసారు. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇకనైనా నిబంధనల మేరకు ఈటీపీలు లేని ప్లాంట్లను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశీలించి మూతపెట్టాలని లేకుంటే సమస్య కొనసాగడం తప్ప పరిష్కారం ఉండదని, అందరూ రోగాల భారిన పడాల్సిందేనని స్థానికులు తెలుపుతున్నారు.

రూ.8లు చెల్లించాలి

మామిడి రైతుల సంక్షేమ సంఘం కలెక్టర్‌కు వినతి

కలెక్టరేట్ వద్ద మామిడి రైతుల సంక్షేమ సంఘం నేతల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యాలు మామిడి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.8లు అమలు చేసి డబ్బులు వెంటనే చెల్లించాలని సోమవారం మామిడి రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రూ.8లు అమలు చేసి తీరాల్సిందేనని స్పష్టంగా చెప్పినప్పటికీ యాజమాన్యాలు ఇప్పటివరకు అమలు చేయలేదని, ఇప్పటికే రైతులు కాయలు సరఫరా చేసి 15 రోజులు మించిపోతున్నదని, సీఎం ప్రకటించిన విధంగా రైతులకు వెంటనే కేజీకి రూ.8ల చొప్పున డబ్బులు చెల్లించాలని కోరారు. కొన్ని పరిశ్రమ యాజమాన్యాలు రూ.4 నుంచి 6ల వరకు చెల్లిస్తామని చెప్పడం సరైనది కాదని ప్రభుత్వం చెప్పినట్లుగా రూ.8లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీ కింద ఇస్తామన్నా మిగిలిన రూ.4లు ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ర్యాంపుల వద్ద మామిడి సేకరణ రద్దు చేసి పరిశ్రమల వద్ద నుంచే తీసుకోవాలని, రైతులకు డబ్బు త్వరగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. సంఘం కన్వీనర్ ఆనందనాయుడు, నాయకులు జనార్ధన్, వాడ గంగరాజు, హేమాద్రి చౌదరి, ఉమాపతి నాయుడు, మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు షరతులతో కూడిన అనుమతులు

- జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 9వ తేదీ బుధవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి బంగారుపాళ్యం మండలం పర్యటనకు షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం స్థానిక పోలీస్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జగన్ పర్యటన సందర్భంగా ముందస్తు చర్యలలో భాగంగా మామిడి యార్డ్, హెలిప్యాడ్ ప్రాంతం, రూట్ మ్యాప్ వంటి అంశాలను ఇప్పటికే పరిశీలించామన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండడానికి, ఇతర జిల్లాలలో జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా హెలిప్యాడ్ వద్ద 30మంది నేతలను అనుమతిస్తామన్నారు. మామిడి యార్డ్‌లో 500 మంది రైతులకు అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. పర్యటన ముగిసే వరకు ఎలాంటి రోడ్ షోలు లేదా బహిరంగ సభలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మామిడి యార్డ్ పక్కన స్కూల్స్, పెట్రోల్ బంకులు ఉన్నందున శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండడానికి 500 మందికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. హెలిప్యాడ్ చుట్టూ డబుల్ లేయర్ బారికేడ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, పర్యటన సమయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండడానికి సిసి.కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించామన్నారు. సత్యసాయి, ప్రకాశం జిల్లా, పల్నాడు ప్రాంతాల్లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా బంగారుపాళ్యంలో కూడా ఆంక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా ఈ షరతులను ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించినా, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

'ఇండోర్ స్టేడియం కూల్చివేత'కు ఏడాది

ప్రజాశక్తి- పుంగనూరు: గత ఏడాది ఇదే రోజున ఇండోర్ స్టేడియంను గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేశారు. ఈ విధ్వంసకర ఘటన జరిగి నేటికీ ఏడాది పూర్తి అవుతుంది. క్రీడాకారులందరూ సామాజిక సమస్యగా స్పందించి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని పట్టణంలో పలువురు క్రీడాకారుల్లో చర్చ నడుస్తుంది. ఎంబిటి రోడ్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఇండోర్ స్టేడియం గత 30 ఏళ్లుగా పట్టణంలోని అన్ని వర్గాల వారికి ఉపయోగపడుతూ ఉండేది. ఈ ఇండోర్ స్టేడియం షటిల్, స్నూకర్స్, క్యారమ్స్, చెస్ లాంటి క్రీడలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే కొందరు వ్యక్తులు ఉన్నఫలంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇండోర్ స్టేడియంను నేలమట్టం చేశారు. స్టేడియంలో సుమారు 150 మంది క్రీడాకారుల షిఫ్ట్ పద్ధతిలో షటిల్ ఆడేవారు. 30 ఏళ్ల క్రితం 7 గుంటల స్థలంలో అప్పటి ప్రభుత్వ అనుమతులతో ఇండోర్ స్టేడియం నిర్మించుకున్నారు. ఇండోర్ స్టేడియం కూల్చివేతపై ఫ్రెండ్షిప్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శరన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పోలీసుల చర్యలు నామమాత్రంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా గతంలో ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉన్న ఇండోర్ స్టేడియం నేలమట్టమై ఏడాది పూర్తి అవుతున్నా.. దీనికి గురించి ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయం.

నేల మట్టం చేసిన ఇండోర్ స్టేడియం (ఫైల్ ఫోటో)

విద్య పురోగతికి ప్రతి ఒక్కరూ శ్రమించాలి

విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

'మెగా పేరెంట్ టీచర్స్ మీట్' పై సమీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్య పురోగతికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో మెగా పిటిఎం 2.0 మార్గ దర్శకాలను వివిధ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యులతో ముందస్తు ఏర్పాట్లు భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్స్ మీట్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలో సుమారు 36,596లక్షల మంది ప్రైవేట్ విద్యార్థులు, 178 ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం భోజనం సమయం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యనూ అందించడానికి విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో 10న మెగా పిటిఎం2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమగ్ర పురోగతి కార్డులను అందిస్తారని ప్రతిబిడ్డ విద్యా పురోగతి తెలుసుకుంటారని తెలిపారు. విద్యాశాఖాధికారి బి.వరలక్ష్మి, డెప్యూటీ విద్యాశాఖాధికారి ఎన్.ఇందిరా, ఏపిసి వెంకటరమణ, ఎంఈఓ నటరాజ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

చిత్తూరు అర్బన్: ఏడాది కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఏపీ బ్రాండ్‌కు పూర్వవైభవం తిరిగి వస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సోమవారం ఎమ్మెల్యే గుడిపాల మండలంలోని నారగల్లు, ఏఎల్ పురం, వెంగమాంబపురం, 197 రామాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు, సూపర్ సిక్స్ పథకాల అమలు, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను అందించారు. చిత్తూరు నగర మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, నాయకులు సుబ్బానాయుడు, అనిల్, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- సోమల: ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం పుంగనూరు నియోజకవర్గ సదుం మండలం చీకలచేను గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ ఫలాల కరపత్రాలను ప్రతి ఇంటికి వెళ్లి నేరుగా మంత్రి పంపిణీ చేశారు. అలాగే గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడు కొన్ని సమస్యలను పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఏ గురజాల

డ్రోన్ కమెరాను వితరణ చేస్తున్న మదర్ థెరిసా కళాశాల యాజమాన్యం

డ్రోన్ కెమెరా వితరణ

ప్రజాశక్తి -గంగవరం: మదర్ థెరిసా విద్యా సంస్థల ఛైర్మన్ రవీంద్రబాబు డిఎస్‌పి డేగల సుధాకర్‌కు లక్షాయాభైవేల రూపాయలు విలువ చేసే డ్రోన్ కెమెరాను సోమవారం వితరణ చేసినట్లు అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ పలమనేరు డివిజన్ పరిధిలో శాంతి భద్రతల నెలకొల్పడానికి ఈ కెమెరా సహకరిస్తుందన్నారు. పోలీసుల కోరిక మేరకు తాము ఈ కెమెరాను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగవరం సిఐ ప్రసాదు, పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీ దారుల సమస్యలు త్వరగా పరిష్కరించండి

తహశీల్దారు లోకనాథ పిళ్లై

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : ప్రజా ఫిర్యాదుల వేదికలో అందించే అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండల అధికారులను తహశీల్దారు లోకనాథపిళ్లై ఆదేశించారు. మండల కేంద్రం ఎస్‌ఆర్‌పురం తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు సమస్యలు పరిష్కరించాలని అందించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కార మార్గం చూపాలని తహశీల్దారు ఆదేశించాలని రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో భాగంగా సోమవారం తహశీల్దారు కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు పొజిషన్ సర్టిఫికెట్‌కు ముగ్గురు, ముటేషన్‌కు నల్గురు, భూమి భాగ పరిష్కారం కోసం ముగ్గురు, రేషన్ కార్డ్ సమస్యల పరిష్కారానికి ఐదు, ఎస్‌ఆర్‌పురంలో శ్మశాన వాటికకు ఒకటి, పుల్లూరులో ల్యాండ్ డిస్ట్రిబ్యూషన్ సమస్యలపై ఒకటి అర్జీలతో కలిపి మొత్తం 18 అర్జీలు స్పందన కార్యక్రమానికి వచ్చాయని లోకనాథపిళ్లై పేర్కొన్నారు. అందులో 3 సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలినవి దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అధికారులు, సిబ్బందికి శిక్షణ: ఎంపీడీవో

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పిఎఐ 2.0పై ఒకరోజు శిక్షణ నిర్వహిస్తున్నామని ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఏఈపీఆర్, ఏపీఎం, ఏపీవో, మెడికల్ ఆఫీసర్లు, ఐసిడిఎస్ సూపరువైజర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు హాజరు కావాలని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిడి నెల్లూరు ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి

కూటమి హామీలపై ప్రశ్నిస్తే కేసులు

వైసీపీ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఎన్నికల్లో కూటమినేతలు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తాను ప్రశ్నిస్తే అది ఓర్వలేక పోలీస్ కేసు నమోదు చేశారని నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి అన్నారు. గంగాధరనెల్లూరులో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిన తీరును ఎండగడుతూ సమావేశాలు ఏర్పాటు చేసి తాను పర్యటన చేశానన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న జనసేన నేతల వద్ద తనపై అక్రమంగా కేసు నమోదు చేయించారని ఆరోపించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఎవరిని అవమానకర రీతిలో మాట్లాడలేదన్నారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో మండల వైసీపీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైసిపి నేతలు హేమలత రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, హరిబాబు, సుబ్రహ్మణ్యం యాదవ్, ఏకాంబరం , కిషోర్ రెడ్డి , ఢిల్లీ కుమార్, మణి, కుప్పయ్య, గోవిందరెడ్డి, వేలు మొదలియార్, మోహన్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు కలెక్టర్ వారి బంగ్లాలో ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఉదయం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ భూమి పూజ చేశారు. నగరంలో రహదారుల విస్తరణలో భాగంగా రైల్వే పైవంతెన నుంచి కొంగారెడ్డిపల్లి వరకు రోడ్డు విస్తరణ కోసం కలెక్టర్ బంగ్లాకు సంబంధించిన స్థలాన్ని కేటాయించారు. వంద అడుగుల మేర రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని కేటాయించడంతో ప్రస్తుతం ఉన్న ప్రహరీ కంటే లోపల మరో ప్రహరీని నిర్మించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 210మీటర్ల మేర ప్రహరీ నిర్మాణానికి కలెక్టర్, ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

డీపీవోకు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి -బంగారుపాలెం: అఖిల భారత సమ్మెకు మద్దతుగా గ్రామ పంచాయతీ కార్మికుల పాల్గొనాలని పారిశుధ్య కార్మికుల సమస్యలన్నిటిని పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు కు సోమవారం పారిశుధ్య కార్మికులు సమ్మె నోటీసు అందించారు. చిత్తూరు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులందరూ అఖిల భారత సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా కమిటీ అధ్యక్షులు కే మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి గోవిందప్ప, కోశాధికారి కే మల్లయ్య, కార్మికులు జిల్లా పంచాయతీ అధికారికి సమ్మె నోటీసును అందించారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని విజలాపురంలో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి, కుప్పం పి ఈఎస్ ఆస్పత్రి , ధార్మిక్ సేవా సమితి సహకారంతో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు 286 మంది రోగులకు బిపి, షుగర్, గుండె జబ్బులు, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పూజిత, బాలు, పిఈఎస్ పిఆర్ హెడ్ రఘు, పి ఆర్‌వి భాస్కర్, ప్రవీణ్, ధార్మిక సేవా సేవా సమితి మహేష్(విజలాపురం రమేష్), టిడిపి నేత కుమార్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ జెండాను ఎగురవేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నేతలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం బందార్లపల్లి క్రాస్ వద్ద ఎంఆర్‌పిఎస్ జెండాను నూతనంగా ఆవిష్కరించారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, గోవిందప్ప, రాఘవేంద్ర, ఉదయ్, పాల్గొన్నారు.

కోదండ రామస్వామికి ద్వాదశి పూజలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో తూర్పు మొగసాలలో వున్న సీత, లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సోమవారం ద్వాదశి పూజలు నిర్వహించారు. అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. దాతలు కొత్త మంచు వెంకటాచలపతి కుటుంబీకులు ఇచ్చిన పులిహోర, పెరుగన్నం భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేశారని గుడి ధర్మకర్త తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని కొత్తపల్లి ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..మేరకు కొత్తపల్లి ఫ్లైఓవర్ పైన ఉన్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మధుసూదన్

ప్రజాశక్తి- కార్వేటినగరం : డిప్యూటీ ఎంపీడీవోగా బివి మధుసూదన్ కార్వేటినగరం ఎంపీడీవో టి చంద్రమౌళి సమక్షంలో సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన జిల్లా పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై కార్వేటినగరం డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్ మాట్లాడుతూ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో అన్ని పంచాయతీలలో తాగునీటిపై దృష్టి పెడతామన్నారు.

ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్

జగన్‌మోహన్‌రెడ్డి రాకకు ఏర్పాట్లు: వైసిపి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మండలంలోని మామిడి రైతులతో సమీక్షిం చేందుకు బుధవారం వస్తున్న సందర్భంగా మండలంలోని కొత్తపల్లి సమీపంలో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు హెలీపాడ్ పనులు వేగవంతం చేశామని వైసిపి నాయకులు పేర్కొన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు తమ నాయకుడికి స్వాగతం పలికేందుకు ఎంతో ఉత్సాహంతో పనులు చేపడుతున్నామని ఈ పనుల్లో నాయకులు బిజీగా గడుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొని స్వాగత ఏర్పాట్లు చేపడుతున్నట్టు తెలిపారు.

జగన్ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న వైసిపి నాయకులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -సోమల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 130 మందికి ఓ దాత సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. సోమల మండలం నెల్లిమంద పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 130 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మోదిన్ బాష కుమార్తె షమీన్ భాను పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు, పెన్సిళ్ళు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాల విద్యార్థులకు ప్రతి ఏడాది తమకు తోచినంత విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నామని ఇందులో భాగంగానే ఈ ఏడాది సైతం పంచాయతీ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశామని తెలిపారు. ఎంఈఓ శివ రత్నమ్మ మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా విద్యాదానం ఎంతో గొప్పదని అలాంటి విద్యాదానానికి సంబంధించి విద్యాసామగ్రిని పంపిణీ చేయడం ఇంకా ఎంతో ఔదార్యంతో కూడుకుందని ఇలాంటి సేవల ద్వారా ఇతరుల్లోనూ చేయాలన్న భావన కలుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు యల్లయ్య మాట్లాడుతూ సహృదయంతో విద్యాసామాగ్రి పంపిణీ చేశారని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న దాతలు

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

మహిళలకు చేతివృత్తి పనిముట్లు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- రామకుప్పం: సమాజంలో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చారని రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహిళలకు హస్తకళల నైపుణ్యం పెంపొందించేందుకు వారికి చేనేత పనిముట్లు పంపిణీ చేశారు. వెదురు అల్లికలు, చేతి వృత్తి పనులు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతులతో ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం దీనికోసం విరివిగా బ్యాంకు రుణాలు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మీకాంత్, నరసింహులు, చిన్ని కృష్ణ, రామ్మూర్తి, గుర్రప్ప, వెంకట్రామ గౌడు, కామరాజ్ నాయక్, వెంకటరమణ, బాలరాజు, మంజునాథ్, మురళీమోహన్, అధికార సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి- రామకుప్పం: ఏడాది కూటమి సుపరిపాలనలో అభివృద్ధి సంక్షేమాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కళ్యాణ మండపంలో క్లిస్టర్ ,కో మిస్టర్ ఇన్‌చార్జిలు యూనిట్, కో యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ లెవల్ ఇన్‌చార్జిలు, పంచాయతీ అధ్యక్షులు తదితరులకు సుపరిపాలనలో ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పథకాలను ప్రజలకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. వైసిపి పాలనలో పనులు, అభివృద్ధి నోచుకోలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు అవుతున్నాయన్నారు. ఈ విషయాలను ప్రతి ఇంటికి చేరవేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి నరసింహులు, నేతలు చిన్న కృష్ణ, రామ్మూర్తి, గంట్లప్ప గౌడు, గుర్రప్ప, వెంకట్రామ గౌడు, రఘు, మహమ్మద్ రఫీ, రవి రెడ్డి, నాగభూషణం, వెంకటరమణ, కామరాజ్ నాయక్, పెరుమాళ్, విజయ్ కుమార్ రెడ్డి, అవినాష్, బాలరాజు, మంజునాథ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మెగా పేరెంట్, టీచర్ సమావేశం

ప్రజాశక్తి- తవణంపల్లి: తవణంపల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ పేరెంట్స్ టీచర్ మీటింగ్‌ను మండల విద్యాశాఖ అధికారి హేమలత సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ జరిగే పేరెంట్స్ మీటింగ్ సమావేశానికి ప్రతి పాఠశాల నుండి తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు అందజేసి తప్పనిసరి హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - యాదమరి: పాఠశాల విద్యార్థులకు సోసైటీ ఫర్ అర్బన్, రూరల్ ఎకామిక్ అండ్ సోషల్ హేబిటేషన్(ఎస్‌యుఆర్ఇఎస్‌హెచ్) ప్రతినిధి స్టాండ్లీ ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని వరిగపల్లె, వరదరాజుల పల్లె, కోడి గుట్ట, పెరియంబాడి, ఓటేరిపల్లె, ప్రాథమిక పాఠశాలలోని సుమారు 125 విద్యార్థులకు నలభై వేల రూపాయలు విలువ చేసే విద్యాసామగ్రి (నోట్స్ పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్స్, పలకలు, రబ్బర్ మొదలైన) వి అందించారు. ఈ పాఠశాల కు స్టాండ్లీ మిత్రులు పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి తీసుకెళ్లి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో కె గొల్లపల్లె పిన్సిపాల్ ఎపి లలిత, కనకాచారి, భాస్కర్ రెడ్డి, అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షురాలు జె హిమబిందు, హెచ్‌ఎంలు సురేష్ రెడ్డి, రేఖారాణి, శశికళ, తులసిముని, అఖిలాండేశ్వరి, ఆ సంస్థ ఉద్యోగులు రవీంద్ర శెట్టి, చందు, పాఠశాల కమిటీ ఛైర్మన్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రోజాను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

వైభవంగా ధర్మరాజుల తిరునాళ్లు

ప్రజాశక్తి -విజయపురం నగరి : మండలంలోని కృష్ణారామాపురం గ్రామంలో ధర్మరాజుల తిరనాళ్లను పురస్కరించుకొని సోమవారం ద్రౌపదమ్మ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఊరేగింపు పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొనగా ఉత్సవ నిర్వాహకులు ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి అర్చనలు చేయించి అమ్మవారి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు తిరుమల రెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకులు ఆనందరెడ్డి, ఏలుమలై రెడ్డి, భాగ్యరాజ్, రవికుమార్, రమేష్, సత్య, రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాల సంతాన సాఫల్య కేంద్రం 'వి కేర్' మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

ఐవిఎఫ్ సెంటర్ స్థాపించిన మొదటి ఏడాదిలోనే 90 శాతం ఫలితాలు వచ్చినందుకు దంపతుల హర్షం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రంగబాబు సర్కిల్ వద్ద వున్న వి కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అంచలంచలుగా సత్ఫలితాలతో అభివృద్ధి చెంది అందరి మన్ననలు పొందుతున్న సందర్భంగా ఎన్నో ఏళ్లుగా సంతానం లేక సంతానం పొందిన ఓ దంపతులు పలమనేరు వి కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఖలీలుల్లా మాట్లాడుతూ పలమనేరులో పుట్టి పెరిగి పలమనేరులోనే చదివిన ప్రముఖ ఈఎన్‌టి స్పెషలిస్టు డాక్టర్ ఖలీలుల్లా తన జన్మభూమికి తన చేతనైన సేవ, సహాయం చేయాలనే సదుద్దేశంతో బయట ఎన్నో ఉద్యోగ అవకాశాలు వచ్చినా , వాటికి వెళ్లక పలమనేరులోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సదుద్దేశంతో 2014వ సంవత్సరంలో అద్దె భవనంలో ఐదు పడకలతో వీ కేర్ ఆసుపత్రిని ప్రారంభించామన్నారు. అతి తక్కువ సమయంలోనే ప్రజల నుంచి మన్ననలు పొందామని, అతనే కాకుండా తన భార్య ప్రముఖ స్త్రీల వైద్యులు గైనకాలజిస్టు డాక్టర్ అంజుమునిషా కూడా అతి తక్కువ సమయంలోనే స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు మెరుగైన సేవలందిస్తూ ప్రజల నుండి మెరుగైన మన్ననలు పొందారన్నారు.

ఐవిఎఫ్ ద్వారా జన్మించిన బిడ్డను దంపతులకు అప్పగిస్తున్న డాక్టర్లు

తర్వాత 2020 లో సొంత భవనంలో అధునాతనమైన వసతులతో, అత్యాధునిక పరికరాలతో, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల గర్భ సమస్యలు, సంతాన సమస్యలు మంచి అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు అందిస్తున్నామని తెలిపారు.

2024 సంవత్సరంలో పలమనేరులో మొట్టమొదట అత్యాధునిక ప్రయోగశాల , కంప్యూటరైజుడ్ ఆపరేషన్ థియేటర్, విలువైన పరికరాలతో సంతాన సాఫల్య కేంద్రం ఐవిఎఫ్ సెంటర్ ప్రారంభించామని తెలిపారు.

పెళ్లి అయ్యి ఏడు సంవత్సరాలుగా పిల్లలు లేకుండా బాధపడి , చివరకు పలమనేరులోని వి కేర్ ఐవీఎఫ్ సెంటర్ ద్వారా ట్రీటెమెంటు తీసుకొని మొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా ఒక బిడ్డకు జన్మనిచ్చిన రజనీ, నాగరాజు దంపతులు వి కేర్ ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతకు ముందు వారు బెంగుళూరులో ఐవీఎఫ్ సెంటర్‌లో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోయిందని తెలిపారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -పుంగనూరు: ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యం సాధ్యమవుతుందని చాలా వ్యాధులకు ఆయుర్వేదం దృష్టి పెడుతుందని కొన్ని వ్యాధులకు నిర్దిష్ట చికిత్సలు అందించవచ్చుని డాక్టర్ దివ్య, డాక్టర్ దీప్తిలు అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగ భవనంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ మదనపల్లి, ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్‌లు సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు దివ్య, దీప్తి మాట్లాడుతూ ఆయుర్వేదం ఎక్కువగా పోషకాహారం జీవనశైలి లో మార్పులు, సమతుల్య ఆరోగ్యం తిరిగి రావడానికి వీటిని ఉపయోగిస్తారన్నారు. ఆయుర్వేదం ఆరోగ్యంపై దృష్టి పెడుతుందన్నారు. కానీ ఇది కొన్ని వ్యాధులకు నిర్దిష్ట చికిత్సలు అందించవచ్చన్నారు. గత ఏడు సంవత్సరాలుగా మదనపల్లిలో హాస్పిటల్ నిర్వహిస్తూ మోకాలు నొప్పులు, నడుం నొప్పులు, సోరియాసిస్, ఆస్తమా లాంటి ఎన్నో రకాల జబ్బులు నయం చేస్తూ జాతీయ స్థాయిలో యంగ్ అచ్చి వెర్స్ బెస్ట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అవార్డు పొంది మంచి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చెంగారెడ్డి ,కార్యదర్శిరామకృష్ణారెడ్డి ,కోశాధికారి సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి, భరత్ భూషణ్, రామ లింగప్ప, విశ్రాంత ఎస్‌బిఐ మేనేజర్ముని వెంకటప్ప, సునంద, దినేష్, చిన్న రెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అధిక దిగుబడినిచ్చే పశుగ్రాసంపై దృష్టి సారించండి

పుత్తూరు ఉప సంచాలకులు డాక్టర్ టి గోవిందయ్య

ప్రజాశక్తి -కార్వేటినగరం: పాడి రైతులు అధిక దిగుబడి, అత్యంత పోషక విలువలు కలిగిన పశుగ్రాస పెంపకంపై దృష్టి సారించాలని పుత్తూరు ఉప సంచాలకులు డాక్టర్ టి గోవిందయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నూరులో పశుగ్రాస వారోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు అత్యధికంగా పోషకాలు కలిగిన పశుగ్రాసను సాగు చేయడానికి రైతులు వెటర్నరీ సిబ్బందిని సంప్రదించి వారి సూచనలు, సలహాల మేరకు సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతులు అత్యధికంగా ఉన్నారని తెలిపారు. అనంతరం పశుగ్రాసంలో రకాలు, వాటి ప్రాముఖ్యతతో పాటు, చాప్ కట్టర్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నూరుకు చెందిన రైతు సాగు చేసిన పశుగ్రాసం పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, డాక్టర్ హేమకుమార్, డాక్టర్ కృష్ణ, విఎల్‌వో శ్రీధర్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న పుత్తూరు ఉప సంచాలకు డాక్టర్ గోవిందయ్య